సాక్షి
నిర్మల్
గురువారం । 18 । జూలై । 2024



తొలి ఏకాదశి వేడుకలు

తొలి ఏకాదశి పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం పిండివంటలు చేసుకుని ఆరగించారు. 9లో ▸



మత సామరస్యానికి ప్రతీక..

మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. డప్పుచప్పుళ్ల మధ్య పీరీలను ఊరేగించారు. పలుచోట్ల అగ్నిగుండం ఏర్పాటు చేసి భక్తులు అందులోంచి దాటారు. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రిక ఇస్తున్న ఆలయ ఈవో

బాసర: ఈ నెల 19నుంచి 21వ తేదీ వరకు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న వ్యాస పౌర్ణమి వేడుకలకు రావాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు బుధవారం ఆహ్వానపత్రిక అందజేసినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

'గ్రామీణ్ సపోర్ట్' సేవలు భేష్



దుస్తులు, బ్యాగులతో చిన్నారులు

నిర్మల్ రూరల్: గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొండాపూర్‌లో గల బాలసదన్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి చిన్నారులకు దుస్తులు, ఆట వస్తువులు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగమణి గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. సంస్థ మేనేజర్ శ్రీనివాస్, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుడు పోతుగంటి నరేశ్‌కుమార్, సీడీపీవో దేవి మురళి, సంస్థ సిబ్బంది శ్రీకాంత్, కిశోర్, గణేశ్, బాలసదన్ సిబ్బంది కవిత తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సన్మానం



భీమేశ్‌ను సత్కరిస్తున్న వేదిక సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ సారస్వత పరిషత్ రాష్ట్రస్థాయి యువపురస్కారాన్ని పొందిన యువ కవి పోలీస్ భీమేశ్‌ను బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ భవన సమావేశ మందిరంలో జిల్లా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. భీమేశ్ రచించిన 'స్వేచ్ఛకు సంకెళ్లు' తొలికవితా సంకలనానికే 'రాష్ట్రస్థాయి యువ పురస్కారం' లభించడం విశేషమని కొనియాడారు. రానున్న రోజుల్లో సాహితీ రంగంలో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేరెళ్ల హనుమంతు, వెంకట్, కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, కవులు డాక్టర్ దామెర రాములు, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, ఉప్పు కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, తుమ్మల దేవరావు, జగదీశ్వర్, భిక్షపతి నాయక్, దీపక్, వెంకట్, రాజేశ్వర్‌రెడ్డి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

నిర్మల్ రూరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం–2024 కోసం నామినేషన్ గడువును ఈ నెల 21వ తేదీ వరకు కేంద్రం పొడిగించిందని డీఈవో రవీందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. http://national awards toteachers. education.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సరైన పత్రాలు జతపరిచి, రెండు కాపీలను ఈనెల 22లోపు డీఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

20న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ఈనెల 20వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీనెల మూడో శనివారం సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ముందుగానే సమాచారం అందించి ఎక్కువమంది హాజరయ్యేలా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతులు, సౌకర్యాలు, తల్లిదండ్రులకు వివరించాలని పేర్కొన్నారు. ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్ సర్వీస్

భైంసాటౌన్: డీఎస్సీ పరీక్ష నేపథ్యంలో హాజరయ్యే అభ్యర్థులకు ప్రత్యేక బస్ సర్వీస్‌ను అందుబాటులో ఉంచినట్లు ఇన్‌చార్జి డీఎం ప్రతిమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5గంటలకు భైంసా బస్టాండ్ నుంచి ఆదిలాబాద్‌కు బస్సు సర్వీస్‌ను నడపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తీర్పులు పట్టవా?



ఆక్రమణకు గురవుతున్న చెరువులు

- చెరువుల పరిరక్షణపై పట్టింపేది?
- 2021లోనే తీర్పు చెప్పిన హైకోర్టు
- ఆక్రమణల తొలగింపునకు ఆదేశం
- నిర్మాణాలు కూల్చిన అధికారులు
- కలెక్టర్ మారిన ప్రతీసారి పాత కథే..
- బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు (ఫైల్)

నిర్మల్: జిల్లాలో చెరువుల పరిరక్షణకు 2021లోనే హైకోర్టు తీర్పునిచ్చింది. చెరువు శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్ లెవల్)లో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు చేపట్టకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లా అధికారులను సీరియస్‌గా హెచ్చరించింది. అప్పటి కలెక్టర్ సరైన చర్యలు చేపట్టకపోతే ఆయననూ పలుసార్లు కోర్టు హైదరాబాద్‌కు రప్పించింది. ఆ తర్వాత చెరువుల్లో అక్రమంగా నింపిన మట్టినీ తీసేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన పలు కులసంఘాల భవనాలనూ కూల్చేశారు. ఆక్రమణకు గురవుతున్న చెరువుల వద్ద కందకాలు తవ్వారు. చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కానీ.. మూడేళ్ల తర్వాత అధికారులు అన్నీ మర్చిపోయారు. కబ్జారాయుళ్లు యథేచ్ఛగా చెరువులను ఆక్రమిస్తుంటే స్పందించడం లేదు. దీంతో హైకోర్టు ఇచ్చిన తీర్పులంటే కూడా లెక్కలేదా.. అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ నాయకులు దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మూడేళ్ల క్రితమే..

ఎక్కడా లేనివిధంగా జిల్లాలో జలవనరుల ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా చెరువులను చెరబడుతూ వందల ఎకరాల శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను కబ్జా చేస్తున్నారు. ఇదే క్రమంలో 2020లో జిల్లాకేంద్రంలోని గొలుసుకట్టులో భాగమైన జాఫర్ (కుర్రన్నపేట) చెరువునూ పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు స్కెచ్‌వేశారు. అప్పటి అధికార పార్టీ అండ, స్థానిక అధికారుల సహకారంతో ఆ చెరువులో ఓ వైపు మొత్తం మొరం నింపేశారు. చదును చేసి ప్లాట్లుగా మార్చేందుకు సిద్ధం చేశారు. ఇలా చెరువును ఆక్రమించడంపై జిల్లాకేంద్రానికి చెందిన న్యాయవాది, ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. జిల్లాకేంద్రంలోని జాఫర్ చెరువుతో పాటు ఇతర చెరువుల్లోనూ ఇలాగే ఆక్రమణలు జరుగుతున్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

కోర్టు సీరియస్‌గా స్పందించి..

నిర్మల్ చెరువుల ఆక్రమణలపై హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. భావితరాలకు నీటి ఇబ్బందులు రాకుండా కాపాడే చెరువుల్లో ఆక్రమణలు ఏమిటని ప్రశ్నించింది. ఈ కేసులో అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీ తోపాటు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను పలుసార్లు కోర్టుకు రప్పించింది. కోర్టు ఆదేశాల మేరకు అప్పటి అధికారులు జాఫర్ చెరువులో నిర్మించిన కట్టడాలను మాత్రమే తొలగించారు. దీంతో పిటిషనర్ మళ్లీ కోర్టుకు వెళ్లి చెరువులో నింపిన మట్టిని తొలగించడం లేదన్న విషయాన్ని వివరించారు. దీంతో కోర్టు సీరియస్‌గా తీసుకుని కలెక్టర్‌కు అంతే సీరియస్‌గా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రత్యేకంగా జేసీబీలు, ట్రాక్టర్లు పెట్టి అప్పట్లో ఆ చెరువులో వేసిన మట్టిని మొత్తం తీయించాల్సి వచ్చింది.

చెరువులను కాపాడాలని..

చెరువుల ఆక్రమణలపై అప్పట్లో వేసిన పిటీషన్‌పై 2021 జూన్ 4న హైకోర్టు తీర్పునిచ్చింది. ఇందులో జిల్లాకేంద్రంలోని ఒకట్రెండు చెరువులే కాదు.. జిల్లాలోని మొత్తం చెరువులను పరిరక్షించాలని కలెక్టర్, ఇరిగేషన్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులను ఆదేశించింది. చెరువులతో పాటు వాటి శిఖం, ఎఫ్‌టీఎల్‌లోనూ ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు ఉండకుండా చర్యలు చేపట్టాలని చెప్పింది. ఈమేరకు జిల్లాకేంద్రంలోని పలు చెరువుల చుట్టూ ట్రెంచ్ (కందకం), మరికొన్ని చెరువులకు ఫెన్సింగ్ (కంచె) ఏర్పాటు చేశారు.

మళ్లీ పాత కథే..

జిల్లాలో కలెక్టర్లు, అధికారులు మారినప్పుడల్లా పాత కథలే పునరావృతమవుతున్నాయి. తాజాగా జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారడంతో మూడేళ్ల కిందటి ఆక్రమణల పర్వం మళ్లీ తెరపైకి వచ్చింది. అప్పటి కలెక్టర్ బదిలీపై వెళ్లడం.. కొత్తగా వచ్చిన కలెక్టర్లు, అధికారులకు సంబంధిత కేసులు, కోర్టు తీర్పులపై సరైన అవగాహన లేకపోవడం కబ్జారాయుళ్లకు వరంగా మారుతోంది. ఇదే అదనుగా అప్పట్లో ఇరిగేషన్, మున్సిపల్ వాళ్లు వేసిన హద్దులను చెరిపేస్తున్నారు. చెరువు చుట్టూ వేసిన కంచెను ఇష్టానుసారంగా లోపలికి జరిపేస్తున్నారు. ఇక కందకాలనూ పూడ్చేసి మళ్లీ చెరువులోపలికి వాళ్లే తవ్వేస్తున్నారు. వీటిపైనే బీజేపీ ఇటీవల 'చెరువుకు దరువుగా.. వరదకు అడ్డుగా..' పోరాటం ప్రారంభించింది. గొలుసుకట్టు చెరువులను కాపాడాలంటూ వాటిని పరిశీలించడంతో పాటు ఇటీవల కొత్త కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు కూడా చేసింది. కానీ.. ఇప్పటికీ వీటిపై సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు.

చెరువులను కాపాడాల్సిందే



జిల్లాలోని చెరువులను పరిరక్షించాలని హైకోర్టు స్పష్టంగా తీర్పునిచ్చింది. ఈమేరకు జిల్లా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాల్సిందే. లేనిపక్షంలో బీజేపీ పక్షాన పోరాడటంతో పాటు మళ్లీ కోర్టుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవడానికి అందరూ ముందుకు రావాలి.

– అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వరినాట్లకు కూలీల కొరత



రాజూరలో నాటు వేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు (ఫైల్)

- అడ్వాన్స్ చెల్లించినా తప్పని నిరీక్షణ
- పొరుగు రాష్ట్రాల కూలీలతో నాట్లు
- పనుల్లో జాప్యం.. ఖర్చు అధికం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

లోకేశ్వరం: వానాకాలం సీజన్‌లో వరి నాట్లు ఊపందుకోగా రైతులను కూలీల కొరత వేధిస్తోంది. అడపాదడప వర్షాలు కురవడంతో వరి విస్తీర్ణం పెరిగింది. రైతులు ఇతర పంటలకు బదులు వరి సాగుపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. లోకేశ్వరం మండలంలో చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకం, బోరు బావుల కింద సాగు పనులు ప్రారంభించారు. అందరూ ఒకేసారి నాట్లు వేస్తుండటంతో కూలీల కొరత అధికంగా ఉంది. దీంతో రైతులు కూలీల కోసం అడ్వాన్స్ చెల్లించి వారం నుంచి 10 రోజుల వరకు వారి కోసం వేచి చూస్తున్నారు.

పెరిగిన కూలి రేట్లు..

గతేడాదితో పోలిస్తే కూలి రేట్లు పెరిగాయి. దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం అధికమైంది. ఎకరాకు సుమారు 10నుంచి12 మంది మహిళా కూలీలు అవసరం కాగా, రైతులు ఒక్కొక్కరికి రూ.400 నుంచి రూ.500 వరకు కూలి చెల్లిస్తూ నాట్లు వేయించుకుంటున్నారు. అలాగే మగవారికి రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లిస్తున్నారు. స్థానికంగా ఉన్న కూలీలేమో నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం సీహెచ్ కొండూర్, నాలేశ్వర్, ఉమ్మెడ, భాద్గుణ, అన్నారం, నందిపేట్, తల్వేద, ఆయిలాపూర్, కొత్తూర్, సీమ్‌రాజ్‌పల్లి గ్రామాలకు వెళ్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి..

కొన్నిచోట్ల బిహార్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. ప్రస్తుతం గడ్‌చాంద గ్రామానికి నల్గొండ కూలీలు, పుస్పూర్ గ్రామానికి మహారాష్ట్ర కూలీలు నాట్లు వేయడానికి వచ్చారు. 12మంది గ్రూపుగా ఏర్పడి ఎకరాకు రూ.5,200 చొప్పున గుత్త నాట్లు వేస్తున్నారు. స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ అధికంగా ఉండడంతో ఇరత రాష్ట్రాల కూలీలతో నాట్లు వేస్తున్నారు. జిల్లాలో 1.25లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

కూలీల కొరత ఉంది



ప్రస్తుతం వరినాట్లు వేయడానికి స్థానికంగా కూలీల కొరత అధికంగా ఉంది. ఎక్కువ డబ్బులు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదు. పదిరోజుల ముందు అడ్వాన్స్ చెల్లించినా కూలీలు వస్తలేరు. దీంతో నాట్లు ఆలస్యం కానున్నాయి.

– అసిబొద్దీన్ పటేల్, ధర్మోర

ఇతర జిల్లాల వారితో..



స్థానికంగా కూలీల కొరత ఉంది. దీంతో ఇతర మండలాలు, జిల్లాలకు చెందిన కూలీలపై ఆధారపడక తప్పడంలేదు. వరి నాట్లు వేసిన నుంచి ధాన్యం తూకం వేసేవరకూ అన్ని పనులకు వారే వస్తున్నారు. దీంతో సాగు ఆలస్యమవుతోంది.

– రాజేశ్వర్, వట్టోలి

ఎరుకల సంక్షేమానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పీ రామారావు పటేల్ తెలిపారు. బుధవారం పట్టణంలోని నర్సింహానగర్‌లో నిర్వహించిన ఏకలవ్య జయంతిలో పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎరుకల సంఘ భవనానికి నిధుల మంజూరుతోపాటు విగ్రహ ప్రతిష్ఠాపనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తోట విజయ్, నాయకుడు సోలంకి భీంరావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో అన్నీ సాధ్యమే..



భక్తులకు బోధిస్తున్న విఠల్ మహరాజ్

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో బుధవారం కీర్తనల కార్యక్రమం (పురాణం) ప్రారంభమైంది. విఠల్ మహరాజ్ కీర్తన చేస్తూ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతీ మనిషికి శక్తిసామర్థ్యాలుంటాయని, సాధన చేస్తే ప్రతీది సాధించవచ్చని తెలిపారు. ప్రతీరోజు స్నానం చేయగానే భగవంతుని నామస్మరణ చేయాలని సూచించారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కీర్తనల కార్యక్రమం ఏడురోజులు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. చివరిరోజు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

విఠలేశ్వరస్వామి దర్శనానికి..



యంచకు వెళ్తున్న యువతులు

బాసర: మండలంలోని మైలాపూర్ గ్రామానికి చెందిన యువతీయువకులు బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా నిజామాబాద్ జిల్లా యంచ గ్రామంలోని విఠలేశ్వరస్వామి ఆలయ సందర్శనకు వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామస్తులు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

'ఉపాధి' పనులకు వెళ్లాలి



కిష్టాపూర్‌లో మాట్లాడుతున్న సురేందర్

లోకేశ్వరం: కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లాలని సామాజిక తనిఖీ ఎస్సార్పీ సురేందర్ సూచించారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సామాజిక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. పనులకు వచ్చిన కూలీలు మస్టర్‌రోల్‌లో సంతకాలు చేయాలని సూచించారు. గ్రామంలో రూ.11.49లక్షల పనులకు గాను సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఎస్సార్పీ భగవాన్, డీఆర్పీ రమేశ్, టీఏ శారద, ఎఫ్ఏ శ్రీనివాస్, కూలీలున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కుభీర్: ప్రభుత్వం తమకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని ప్రకటించడంతో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను గుర్తించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, పోశెట్టి, గంగాధర్, పెంటాజీ, శివరాం, లక్ష్మణ్, లింగన్న తదితరులున్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

ఇదే తరుణం.. మొక్కలు నాటుదాం



మొక్కలతో మురిసిపోతున్న పరిమండల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు (ఫైల్)

- ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ టీచర్లు
- విభిన్న రీతుల్లో మొక్కల పెంపకం
- పచ్చదనం పెంపునకు తోడ్పాటు

నిర్మల్‌ఖిల్లా: భూమి ఉష్ణతాపాన్ని తగ్గించాలన్నా.. సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా పండాలన్నా.. స్వచ్ఛమైన ప్రాణవాయువు మనకు అందాలన్నా.. పర్యావరణ సమతుల్యత చేకూరాలన్నా.. పచ్చని ప్రకృతి, మొక్కల తోడ్పాటు తప్పనిసరి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమం ఇందుకు తోడ్పడుతుంది. మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలంతా బాధ్యతగా ఉండాల్సిన తరుణమిదేనని, ప్రకృతి రుణాన్ని తీర్చుకుందామని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు. పచ్చని చెట్లు, సహజ సంపదకు నిలయంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతీ సంవత్సరం విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒకవైపు వర్షాలు కురుస్తుండగా, మరోవైపు విపరీతమైన ఉక్కపోత, తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవడం గత వేసవిలోనే చూశాం. ఉమ్మడి జిల్లాలో ప్రతీ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవలి వేసవిలోనూ దాదాపు 47 డిగ్రీలకు సమీపంలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలా ప్రకృతి అసమతుల్యంగా ఉండటానికి ప్రధాన కారణం అటవీ విస్తీర్ణం తరిగిపోవడం, మొక్కల పెంపకం లేకపోవడమేనని వాతావరణ, అటవీ, ఉద్యానవన శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహిస్తున్న సందర్భంలోనైనా ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మేము సైతం అంటూ విద్యార్థులు..

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అలా నాటిన మొక్కల్ని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఇలా విద్యార్థులూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అటవీ విస్తీర్ణం పెంపే లక్ష్యంగా..



జిల్లాలోని ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బీ పవన్‌కుమార్‌కు మొక్కల పెంపకంపై ఆసక్తి ఎక్కువ. అందరిలా కాకుండా భిన్నంగా ఆలోచించాడు. ఇంట్లో తిని పారేసిన వివిధ రకాల పండ్లలోని గింజలను సేకరిస్తుంటాడు. వాటిని ఎండబెట్టి భద్రపరుస్తుంటాడు. సుమారు 10కిలోల విత్తనాలను వానాకాలం ప్రారంభం కాగానే సమీప అటవీ ప్రాంతంలో ఎనిమిదెకరాల విస్తీర్ణంలో వెయ్యి గుంతలు తీసి నాటాడు. ఇందుకు మిత్రులు భూక్యా దేవిదాస్, గుగ్లావత్ గణేశ్, గుగ్లావత్ దేవేందర్, జాదవ్ ప్రదీప్ సహకారం తీసుకున్నాడు. మరికొన్నింటిని సీడ్ బాల్స్‌గా తయారు చేసి అడవిలో దూరంగా విసిరాడు. ఇలా మూడేళ్లుగా ప్రతీ వానాకాలంలోనూ మొక్కల పెంపకానికి కృషి చేస్తున్నాడు. తాను నాటిన మొక్కల్లో 20శాతమైనా పెరిగి పండ్లనిస్తే చాలని చెబుతున్నాడు.

ఇల్లా.. నందన'వనమా'..!



పచ్చదనం పరుచుకున్నట్లుగా ఉన్న ఈ ఇల్లు జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ ప్రాంతంలో నివాసముండే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మల దేవరావుది. దేవరావుకు మొక్కల పెంపకం అంటే అమితాసక్తి. ఇంటి ఆవరణ, ప్రహరీపై, డాబాపై సుమారు 100 రకాలకుపైగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నాడు. వాటిలో జామ, సీతాఫలం, దానిమ్మ, కొబ్బరి, బీర, పచ్చిమిర్చి, టమాటా, వంకాయ, బెండ చెట్లు కూడా ఉన్నాయి. తాను నాటిన మొక్కల నుంచి వచ్చే తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా వినియోగిస్తున్నాడు. నిమ్మగడ్డి, కరివేప, గోధుమగడ్డి, ఇతర ఆయుర్వేద ప్రయోజనాలుండే మొక్కలు కూడా పెంచుతున్నాడు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు


పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు, మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. జైనథ్ మండలంలోని గిమ్మ(కె) గ్రామానికి చెందిన మాదాసు సాయి మహారాష్ట్ర నుంచి 12 లీటర్ల ఆరు మద్యం బాటిళ్లను తీసుకొస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

ఆదిలాబాద్‌రూరల్: హెచ్‌సీఎల్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆదివాసీ విద్యార్థులు ఎంపికయ్యారు. చించుఘాట్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు పెందూర్ రూప, సిడాం శ్రీజ జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 26 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో సదరు విద్యార్థినులు పాల్గొననున్నారు.

ఆ ఒక్కటీ అడక్కు..!

- పుట్టగొడుగుల్లా మ్యారేజ్ బ్యూరోలు
- ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400
- సంబంధాల పేరిట వేలల్లో ఫీజు వసూలు
- జాతకాలు కలవలేదంటూ బుకాయింపు



మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల ఓ సినిమాలో మ్యారేజ్ బ్యూరో వాళ్లు అబ్బాయిలకు పెళ్లి సంబంధం చూస్తామని వివిధ స్కీంలలో చేర్పిస్తారు. ఓ అమ్మాయి వెళ్లి అబ్బాయిని కలిసి ఇప్పుడే పెళ్లి ఇష్టం లేదని చెప్పిస్తారు. దీంతో ఆ అబ్బాయిని మరో స్కీంలో చేర్పించి మళ్లీ ఫీజు వసూలు చేస్తారు. ఈ తతంగాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు ఎప్పుడో వంటబట్టించుకున్నారు. యువతుల ఫొటోలు చూపించి మీ ఫొటో, వివరాలు కూడా అమ్మాయి వాళ్లకు నచ్చాయి. మీరు ఫీజు చెల్లించిన తర్వాత సంబంధం మాట్లాడుదాం అంటూ ఫీజు చెల్లించగానే అమ్మాయి తాలూకు బంధువుల, కుటుంబంలో ఎవరో చనిపోయారని, ఇంట్లో వారికి ఆరోగ్యం బాగాలేదని, అమ్మాయి, అబ్బాయి రాశులు, జాతకాలు కలవలేదని, మరో అమ్మాయి చూపిస్తామని బుకాయిస్తున్నారు. ఇలా పెళ్లి కోసం చూస్తున్న అబ్బాయిలను బోల్తా కొట్టిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400 వరకు మ్యారేజ్ బ్యూరోలు ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని కులాలు, ఉద్యోగులు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, వ్యాపారులకు సంబంధాలు కుదుర్చుతామని, రెండోపెళ్లి సంబంధాలూ చూస్తామని విజిటింగ్ కార్డ్స్, వాల్‌పోస్టర్లు వేస్తున్నారు.

పెట్టుబడి లేని వ్యాపారం

మ్యారేజ్ బ్యూరో అనేది పెట్టుబడి లేని వ్యాపారంలా మారింది. పెళ్లి సంబంధం పేరిట రూ.5వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉంది. అబ్బాయి పై చదువులు చదివి ఉన్నతోద్యోగం చేస్తున్నా సరైన సంబంధం దొరకడం కష్టంగా మారింది. వధువు కోసం వెతుకుతున్న యువకుల కుటుంబ సభ్యులు మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో అబ్బాయి చదువు, కుటుంబ నేపథ్యం, పుట్టిన తేదీ తదితర వివరాలు సేకరిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అమ్మాయిల ఫొటోలు చూపించి తప్పుడు అడ్రస్ చెబుతున్నారు. అమ్మాయిల ఫొటోలు చూపించి రూ.10వేలు ఫీజు చెల్లించండి అమ్మాయి వాళ్లతో సంబంధం మాట్లాడుతాం అంటూ వసూలు చేస్తున్నారు. డబ్బు చెల్లించిన తర్వాత పెళ్లి సంబంధం కుదర్చడంలో దాట వేస్తున్నారు. 'ఫీజు చెల్లించిన తర్వాత ఫొటో చూపించి అమ్మాయి వాళ్ల బంధువులు చనిపోయారని, అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో ఉన్నారని, అమ్మాయి, అబ్బాయి జాతకం కలవడం లేదని చెబుతున్నారు..' అంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ యువకుడు వాపోయాడు. పట్టణాల్లోని మ్యారేజ్‌బ్యూరోల సంస్కృతి గ్రామాలకూ విస్తరించింది. వధువుల కోసం వెతుకుతున్న వారు ఎక్కువగా ఉండడంతో పెళ్లి సంబంధాలు చూస్తామని తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఏ సామాజిక వర్గమైనా మొదటి, రెండో పెళ్లి సంబంధం కుదుర్చుతామని నమ్మబలుకుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఆర్థికంగా బాగానే ఉన్నా ఉద్యోగం లేదని అమ్మాయిని ఇవ్వడం లేదు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య గణనీయంగా తగ్గడంతో యువకులకు 35ఏళ్లు దాటినా పెళ్లి కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకునేందుకూ కొందరు వెనుకాడడం లేదు. ఇలా పెళ్లి కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరోలో రూ.లక్షల్లోనే ఫీజులు వసూలు చేస్తున్నారు. సామాజిక వర్గం పట్టింపు లేదని, ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్న అబ్బాయికి పేదింటి అమ్మాయి సంబంధం కుదిర్చితే గంపగుత్తగా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొందరు దీన్ని ఆసరాగా చేసుకుని అమ్మాయి, అబ్బాయి వివరాలు, కుటుంబ నేపథ్యం తెలుసుకోకపోవడం వల్ల గొడవలకు దారితీసి పోలీసు, కోర్టు కేసుల వరకు వెళ్లి విడాకులకు దారి తీస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ లేకుండానే..

మ్యారేజ్ బ్యూరో నిర్వహణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్, వెల్ఫేర్ కార్యాలయంలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో 90శాతం ఎలాంటి అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండానే బ్యూరోలను నిర్వహిస్తున్నారు.

మూడు ముళ్ల బంధం.. మూడు నెలలే..

- హైదరాబాద్ వ్యాపార కుటుంబానికి చెందిన అబ్బాయికి బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయికి ఎనిమిది నెలల క్రితం మ్యారేజ్‌బ్యూరో ద్వారా సంబంధం కుదిర్చారు. సామాజిక వర్గాలు వేరైనా కట్నం లేకుండా అమ్మాయిపైనే ఆభరణాలు వేసుకుని పెళ్లి చేసుకున్నారు. ఈ సంబంధం కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరో రూ.2లక్షల వరకు డిమాండ్ చేశారు. అబ్బాయి కుటుంబానికి సంబంధించి నిజానిజాలు తెలియకపోవడంతో కొన్ని నెలల్లోనే గొడవల కారణంగా పోలీసుస్టేషన్ వరకు వెళ్లినట్లు తెలిసింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఓ మండలానికి చెందిన అమ్మాయి మహారాష్ట్రలోని ఓ అబ్బాయికి మ్యారేజ్ బ్యూరో ద్వారా పెళ్లి సంబంధం కుదిర్చారు. అప్పటికే ఆ అబ్బాయికి పెళ్లి అయి పిల్లలూ ఉండడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి.

ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్

తానూరు : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. ఈ నెల 12న ముధోల్ మండలం తరోడా నుంచి తానూరు మండలం బెంబరకు ఇటుకలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ హంగిర్గా సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యాతలం గంగారెడ్డిని దాటే క్రమంలో అదుపుతప్పి వెనుక టైరు కిందపడి మృతి చెందాడు. వివరాలు సేకరించిన పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ సునీల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామన్నారు.

వైన్స్‌లో చోరీ


సగం వరకు తెరిచి ఉన్న షటర్

దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లోని సాయిలక్ష్మి వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం షటర్ పైకి లేపి ఉంచడాన్ని గమనించిన గ్రామానికి చెందిన పలువురు వాహన చోదకులు సదరు వైన్స్ యజమానులకు సమాచారం అందించారు. వైన్స్ నిర్వాహకుడు గౌస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలించిన షాపు నిర్వాహకులు ముసుగు ధరించిన వ్యక్తులు లోనికి చొరబడినట్లు గుర్తించారు. వైన్స్‌లోని రూ.20వేలకు పైగా నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.

పొలంలో బయటపడ్డ విగ్రహాలు


విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

దస్తురాబాద్: పంటపొలంలో దేవుని విగ్రహాలు బయట పడిన సంఘటన బుధవారం మండలంలోని రేవోజీపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రేవోజీపేటకు చెందిన కోల మహేష్ తన పొలాన్ని రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్నుతుండగా నాగలికి విగ్రహాలు తగిలి బయటకు వచ్చాయి. ట్రాక్టర్ డ్రైవర్ వాటిని గమనించకుండానే వెళ్లిపోయాడు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరికి నంది విగ్రహం కనిపించడంతో యజమానికి సమాచారం అందించాడు. అతని ద్వారా ఒగ్గు పూజారులకు విషయం తెలియజేయడంతో గ్రామస్తులంతా కలిసి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి నంది విగ్రహాన్ని భూమిలోంచి బయటకు తీస్తుండగా శివలింగం విగ్రహం కనిపించింది. దీంతో రెండు విగ్రహాలను బయటకు తీసి సంప్రోక్షణ పూజలు చేశారు. విషయం తెలిసిన గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేశారు.

రెండు బంగారం దుకాణాల్లో చోరీ


దుకాణంలో పరిశీలిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: పట్టణంలోని రెండు స్వర్ణకార దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. పద్మావతి కాలనీలో కే సంతోష్‌తో పాటు అర్కోజు రాజుకు చెందిన దుకాణాల్లో రాత్రి 2:40 గంటల ప్రాంతంలో ముగ్గురు గుర్తు తెలియని దొంగలు షటర్ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడిన దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. సంతోష్ దుకాణంలో 9 కిలోల వెండి, కొంత నగదు, రాజు దుకాణంలో 12.9 తులాల బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షటర్ తాళాలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ డి.రాజారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం అధికారి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలి పారు. ఇదిలా ఉండగా పట్టణంలో భారీగా పోలీసు బందోబస్తు ఉన్నా తరచూ చోరీ ఘటనలు జరుగుతుండడం పట్టణ వాసులను కలవరపెడుతోంది.



విధుల్లో ఉన్న పోలీసులపై దాడి

ఎదులాపురం: విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసిన సంఘటన టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొలిపూరకు చెందిన సాయికుమార్, నవీన్ మంగళవారం రాత్రి రిమ్స్‌కు వెళ్లి బైక్ పార్కింగ్ చేస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అటుగా పార్కింగ్ చేయాలని సూచించగా వారితో గొడవకు దిగారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ భూమన్న, హోంగార్డు రవీందర్‌రెడ్డి విషయం తెలుసుకునేందుకు వెళ్లగా వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి బుధవారం బోథ్ మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు.

రూ.11.22 లక్షల విలువైన గుట్కా పట్టివేత


ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాంకిడి: రూ.11.22 లక్షల విలువ గల నిషేధిత గుట్కా పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షాహిద్ ఆటో ట్రాలీలో మంగళవారం రాత్రి మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడికి వస్తుండగా జాతీయ రహదారి- 363పై పోలీసులు తనిఖీ చేశారు. ట్రాలీలో 30 బ్యాగులు ఉండగా ఒక్కోదాంట్లో 40 మాజా(నిషేధిత పొగాకు) డబ్బాలు ఉన్నట్లు తెలిపారు. బ్యాగులను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, హెడ్‌కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నెలకో పుట్టిన రోజు..


విభిన్నరకాల డెకరేషన్ల మధ్యన పుట్టినరోజు వేడుకలు (ఫైల్)

- చిన్నారులకు నెలనెలా బర్త్‌డే సంబరాలు
- ఇంటింటా ఆనందాల హరివిల్లులు
- జిల్లాలో విస్తరిస్తున్న సరికొత్త పంథా..

నిర్మల్‌ఖిల్లా: ప్రతీఇంట్లో చిన్నారి శిశువు జన్మించిందంటే చాలు.. ఆ ఇంట్లో ఇక ఆనందాల పండుగే.. ఇక తమ ఇంట్లోకి కొత్త వ్యక్తిని ఆహ్వానిస్తూ చేసే పండుగలు తొలిసారి ఉయ్యాల వేడుక, నామకరణ మహోత్సవాలు. వీటికి అదనంగా ఇటీవల నూతన సంస్కృతి విస్తరిస్తూ వస్తోంది. తమ కుటుంబంలోకి నూతనంగా విచ్చేసిన ఆ శిశువుకు తన పుట్టిన తేదీన ఏడాది పాటు ప్రతీనెల సంబరాలు జరుపుతున్నారు. ఈ సరికొత్తపంథా ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలలో మొదలుకాగా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం విస్తరిస్తోంది. హంగు ఆర్భాటంతో ప్రతి నెల పుట్టిన తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఖర్చులకు కూడా వెనుకాడటం లేదు. వివాహం చేసుకున్న నవదంపతులు పెళ్లయిన ఏడాది రెండేళ్లకే తమ జీవితంలోకి నూతన కుటుంబ సభ్యుడైన చిన్నారి శిశువును ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు.

వినూత్నంగా వేడుకలు..

శిశువు వయసు ప్రకారం ప్రతి నెల పుట్టిన రోజు వేడుకలు జరుపుతుండగా పుట్టి ఒక నెల రోజులు పూర్తయితే మొదటి నంబర్ సంఖ్యతో.. రెండు నెలలు పూర్తయితే రెండో నంబర్ సంఖ్యతో అలా 12 నెలల వరకు ప్రతీనెల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో వినూత్న రీతిలో వివిధ రకాల వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కూరగాయలు, పండ్లు, దేవుని చిత్రపటాలతో అలంకరణ చేస్తున్నారు. వాటిని ప్రత్యేక ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫరుతో ఫొటోలు, వీడియోలను తీయించుకుంటూ తీపి గుర్తులుగా భద్రపరుచుకుంటున్నారు.

ప్రత్యేకంగా స్టూడియోలు...

చిన్నారుల నెలవారి పుట్టినరోజు వేడుకల నిర్వహణకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడంతో జిల్లా కేంద్రాలు, పట్టణాలలో నూతనంగా స్టూడియోలు ఏర్పాటవుతున్నాయి. నిర్మల్‌లో విభిన్న రకాల డిజైన్లతో కూడిన సెట్టింగ్‌లను ప్రత్యేకంగా వేయించి అద్దెకు ఇస్తున్నారు. కొంత మొత్తంలో డబ్బు చెల్లించిన తల్లిదండ్రులు తమ చిన్నారుల నెలవారి పుట్టినరోజు వేడుకలను ఈ స్టూడియోలో నిర్వహిస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. తల్లిదండ్రుల అభిరుచికి అనుగుణంగా స్టూడియో ఏర్పాటు చేసినట్లు నిర్మల్‌లోని ఓ స్టూడియో నిర్వాహకుడు కాంద్రే రామరాజ్ తెలిపారు.

నెలనెలా వేడుకలు నిర్వహించాం



మా బాబు వయసు ప్రస్తుతం ఏడాది. పుట్టినప్పటి నుండి ప్రతినెలా పుట్టినతేదీ ప్రకారం వేడుకలు నిర్వహించాం. ప్రత్యేకంగా అలంకరించిన డిజైన్ల మధ్య మా బాబుని ఉంచి ఫొటోలు, వీడియోలు తీస్తున్నాం. వాటిని మావాడు పెద్దయిన తర్వాత చూసి మురిసిపోయేలా భద్రపరుచుకుంటున్నాం.

– కొట్ల మమత, సురేశ్, చించోలి (బీ)

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు మృతి

జైపూర్: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్నస్వామి ఆలయ సమీపంలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూరం బ్రహ్మారెడ్డి (58) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బ్రహ్మారెడ్డి ఆర్కే6 గనిలో కోల్‌కట్టర్‌గా పని చేస్తున్నారు. 11న మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా చెన్నూర్ వైపు నుంచి శ్రీరాంపూర్ వెళ్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ముందుగా రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


బ్రహ్మారెడ్డి (ఫైల్)

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ముస్తాఖ్ అదృశ్యమైనట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రోజులాగే ముస్తాఖ్ మంగళవారం ఉదయం తన ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదు. బుధవారం ముస్తాఖ్ భార్య ఆయేషా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వ్యాపారి ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని అంగడిబజార్‌కు చెందిన ప్రతాప్ (55) పాత బస్టాండ్ ప్రాంతంలో స్టీల్ బోల్ల దుకాణం నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగా నడవకపోవడంతో అప్పులు చేసి ముగ్గురు స్నేహితులతో కలిసి వేరే వ్యాపారంలో పెట్టుబడి పెట్టి నష్టాలపాలయ్యాడు. అప్పులు చెల్లించే మార్గం తెలియక మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


కొమ్ములు, తోక విరిగిపోయిన అడవి దున్న

నాడు ఆకర్షణీయం..

నేడు అధ్వానం


వీపు భాగం పగిలిపోయిన దున్న

పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యాటకులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో మావల మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు వెచ్చించి హరితవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా అడవి దున్న ప్రతిమను ప్రతిష్ఠించారు. అయితే నిర్వహణ, పర్యవేక్షణలోపంతో అడవి దున్న కొమ్ములు, తోక తెగిపోగా వీపుభాగం పగిలిపోయి అధ్వానంగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్